



పండగొచ్చింది!

కొత్త దుస్తులు.. రకరకాల పిండి వంటలు.. బంధుమిత్రుల ముచ్చట్లు.. కొత్త అల్లుళ్లకు మర్చిపోలేని మర్యాదలు.. పిల్లాపాపల ఆటపాటలు అన్నీ కలబోసుకుని సంబరాల సంక్రాంతి సమీపించింది. భోగి రోజు దేవుడికి పప్పు అన్నం సంక్రాంతినాడు పెద్దలకు కలగూర నైవేద్యం, కనుమ రోజు గోమాతలకు పుల్లట్లు సమర్పించడం స్థానిక ప్రజల ఆనవాయితీ. బతుకు తెరువు కోసం ఎక్కడెక్కడికో వలస వెళ్లిన వారంతా గ్రామాలకు చేరుకుంటున్నారు. దీంతో పల్లెల్లో పండగశోభ మొదలయింది.

- నేడు భోగభాగ్యాల భోగి
- రేపు సంక్రాంతి సంబరాలు
- ఎల్లుండి కనుమ కాంతులు
- కళకళలాడుతున్న గ్రామాలు

పెందుర్తి:

జనవరి నెలను తలచుకోగానే మదిలో కలిగే పులకింత సంక్రాంతి సంబరాలు. ధనుర్మాసం నెల రోజులూ పల్లె వాకిళ్లలో రంగవల్లుల పలకరింత.. మంచు పొరల తెరలు తొలగుతున్న వేళ హరిదాసుల నారాయణ కీర్తనలు.. అమ్మగారికి, అయ్యగారికి దణ్ణం పెడుతూ డూడూ బసవన్నల కాలి అందెల సవ్వడి.. కోడి పందాలతో పందెం రాయుళ్ల హడావుడి కలగలిసి అచ్చతెనుగు ఆనందాల పండగ సంక్రాంతి. శుక్రవారం భోగి మంటలతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు ముక్కనుమ వరకు అంబరాన్నంటేలా నిర్వహించేందుకు నియోజకవర్గ ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

ఆహా ఏమి రుచి..

ఈ పండగ మూడు రోజులూ నోరూరించే పిండివంటలు, షడ్రుచుల విందు భోజనం జిహ్వా చాపాల్యాన్ని సంతృప్తి పరుస్తాయి. పండగకు అరిసెలు, మినప సున్నుండలు, జంతికలు, పొంగడాలు, బూరెలు ప్రత్యేకాకర్షణ. కొత్త ధాన్యం, బెల్లం ఇళ్లకు చేరడంతో ఆయా పిండివంటలు తప్పనిసరి. ఇంట్లో మహిళలు వేడి వేడి జంతికలు వేస్తుంటే దొంగచాటున పిల్లలు, పెద్దలు తినేయడం అదో సరదా. సున్నుండలను బావలకు తినిపించేందుకు మరదళ్లు పడే ఆరాటం చూడముచ్చటగా ఉంటుంది. ఇక గ్రామాల్లో కనుమనాడు తప్పనిసరిగా మాంసాహారం వండుకోవడం కద్దు. కొత్త అల్లుళ్లకు అన్నిరకాల మాంసాహార వంటకాలు వండి కొసరి కొసరి వడ్డించడంలో ఉండే ఆనందం అనుభవించాల్సిందే..!



భోగి మంట(ఫైల్)

సమరానికి సిద్ధం

సంక్రాంతి సంబరాల్లో కోడిపందాలు, చతుర్ముఖపారాయణం జోరందుకుంటాయి. పండగ మూడు రోజులతో పాటు తరువాత వచ్చే అమ్మవార్ల తీర్థాల్లో వీటి జోరు ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే పందెం రాయుళ్లు కోళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. కోడిపందాలు ఓ గ్రామానికి మరో గ్రామానికి మధ్య పరువు ప్రతిష్టలకు సంబంధించినదిగా భావిస్తారు. పందెంలో ఓ గ్రామానికి చెందిన కోడి గెలిస్తే ఆ గ్రామానికి ఎనలేని కీర్తి వచ్చినట్లు ఆనందిస్తారు. కోళ్లతో పాటు ఆయా ప్రాంతాల ఆర్థిక స్థితిని బట్టి రూ.వేలు నుంచి రూ.లక్షల్లో పందాలు కాస్తుంటారు. కొన్నిచోట్ల భూములు, ఆస్తులను కూడా పణంగా పెట్టి పోటీలు జరుగుతుంటాయి. అయితే పోలీసులు ఈ ఏడాది పందాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించడంతో పందెం రాయుళ్లకు కాస్త గండమే.!



సంక్రాంతి ముగ్గు



పెందుర్తి రైతుబజారులో కొనుగోలుదారుల సందడి

రద్దీగాదుకాణాలు

పండగ సందర్భంగా ఆదివారం సాయంత్రం దుకాణాలన్నీ సందడిగా మారాయి. నూతన వస్త్రాల కొనుగోళ్లకు జనం పోటెత్తడంతో వస్త్రదుకాణాలు రద్దీగా మారాయి. పలుచోట్ల పండగ సంతలు నిర్వహించారు. పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లో వ్యాపారం భారీగా జరిగింది. చాలాప్రాంతాల్లో భోగిరోజు సోమవారం ఉదయం కూడా కొనుగోళ్లు జరుగుతాయి. మరోవైపు సంక్రాంతి సంబరాల ఆరంభంగా రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పెందుర్తి ప్రాంతంలో పలుచోట్ల మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.



రైతు బజార్ వద్ద చెరకు గడల కొనుగోళ్లు

సింహగిరిపై నేడు గోదా కల్యాణం

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం సాయంత్రం గోదా రంగనాథుల కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం వైదికులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎదురు సన్నాహోత్సవం, కల్యాణోత్సవ ఘట్టాలను వైభవంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉదయం జరగాల్సిన నిత్యకల్యాణాన్ని కూడా గోదా కల్యాణంతో కలిపి జరపనున్నారు.

వెంకన్న ఆలయంలో..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి గోదా రంగనాథుల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. రూ.వెయ్యి టికెట్ తీసుకుని కల్యాణంలో పాల్గొనే ఉభయదాతలకు శేషవస్త్రాలు అందించనున్నట్లు వైదికులు తెలిపారు.

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పెందుర్తి: శ్రీకాకుళం కేంద్రంగా వచ్చేనెల 6 నుంచి 9 వరకు తలపెట్టిన అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సమాఖ్య ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. సుజాతనగర్‌లోని భగత్‌సింగ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు, ప్రధాన కార్యదర్శి వై.రాంబాబు మాట్లాడుతూ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న నిరంకుశ పాలనపై సభలో గళమెత్తుతామన్నారు. కార్యక్రమంలో తరుణ్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూర్వవిద్యార్థుల ఉదారత



మృతుడు నీలబాబు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పరవాడ: స్థానిక జెడ్పీ హైస్కూల్ 2001–02 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. వారంతా కలిసి రూ.లక్ష సమీకరించి, ఇటీవల మరణించిన గ్రామానికి చెందిన బండారు నీలబాబు కుటుంబానికి రూ.50 వేలు, ఫార్మాసిటీ కాలనీకి చెందిన గొల్లవిల్లి సింహాద్రి కుటుంబానికి రూ.25 వేలు, మునగపాక మండలం రాజుపేట గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాసరావు కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థుల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా, వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్న వీరిని, స్థానికులు అభినందించారు.

జూనియర్ కాలేజీల మేనేజ్ మెంట్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ డైరీని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం ఆవిష్కరించారు. తవ్వవానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ జిల్లా రూరల్ అధ్యక్షుడు కె.జనార్దన్, ప్రధాన కార్యదర్శి రాపర్తి కృష్ణమోహన్‌తో కలిసి ఆవిష్కరించి, సభ్యులకు అందించారు. వివిధ కళాశాలల నిర్వాహకులు అడపా శేషగిరి, కె.నాగేశ్వరరావు, ఇ.గోవిందరావు, ఎం.మురళి, పి.సత్యనారాయణ, ఆర్.రామశేషు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని మార్గం అనుసరణీయం



వివేకానందుడి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న సూర్యకళ, పాఠకులు

పెందుర్తి: యువతకు స్వామి వివేకానందుడి మార్గం నిత్య అనుసరణీయమని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలు నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. విశ్వానికి భారతీయ ఔన్నత్యాన్ని చాటిన మహోన్నత వ్యక్తి వివేకానందుడు అని కొనియాడారు. పలువురు వక్తలు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడి పందాల శిబిరాలపై పోలీసుల దాడులు

- 9 మంది అరెస్ట్, కోడిపుంజులు స్వాధీనం



పోలీసుల అదుపులో కోడి పందాల నిర్వాహకులు

పరవాడ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని దేశపాత్రునిపాలెం, తానాం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన కోడి పందాల శిబిరాలపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందాలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 కోడి పుంజులు, రూ.5,100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

రామాలంకరణలో సింహాద్రినాథుడు



రామాలంకరణలో అప్పన్న



తిరువీధిలో స్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారుడిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను మరొక పల్లకిలో చేర్చి, సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవం.. తిరువీధి మహోత్సవం

- గోదాదేవికి విశేష అభిషేకాలు
- నేడు గోదారంగనాయకుల కల్యాణ మహోత్సవం



పల్లకీలో స్వామివారి ఊరేగింపు



సారె ఊరేగిస్తున్న మహిళలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు



కోలాటమాడుతున్న మహిళలు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఆదివారం స్వామివారికి విశేష పూజలు జరిపారు. తిరుప్పావై సేవా కాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 28వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్ల తిరువీధి మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. పెందుర్తి కూడలి నుంచి వేంకటాద్రి వరకు భారీ ఎత్తున ఉత్సవం నిర్వహించారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సోమవారం భోగి పర్వదినం సందర్భంగా గోదా రంగనాయకుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో నీలిమ తెలిపారు.

‘పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి’



విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా కరెంట్ బిల్లులను దగ్ధం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీఐటీయూజిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీ పెంపునకు వ్యతిరేకంగా పరవాడలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంగా ఉన్న సమయంలో గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి, తాము అధికారంలోకి వస్తే భవిష్యత్‌లో విద్యుత్ చార్జీలను పెంచబోమని టీడీపీ చేసిన వాగ్దానాన్ని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను తుంగలో తొక్కి అడ్డగోలు చార్జీల పేరిట ప్రజలకు భారం మోపడం అన్యాయమన్నారు. ఎప్పుడో వాడిన కరెంటుకు ట్రూఅప్ చార్జీల పేరిట ఇప్పుడు ప్రజలపై రూ.18 వేల కోట్ల భారం వేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు వచ్చిన విద్యుత్ బిల్లులను సోమవారం భోగి మంటల్లో వేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో భాగంగా పెరిగిన విద్యుత్ బిల్లులను మంటల్లో వేసి తగులబెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గేదెల అప్పారావు, నలమారి గురునాథరావు, పి.అప్పారావు, శ్రీను పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం, నరవ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పెందుర్తి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. నరవలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గుర్రంపాలెంలో ఓ తోటలో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఘనంగా ధారోత్సవాలు



అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై మూడవరోజు ఆదివారం ధారోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం గోదాదేవి అమ్మవారు, చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్టింపజేసి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లని వేంజేపచేశారు. గంగధార జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకి విశేషంగా అలంకరణ చేసి గంగధార వద్ద మండపంలో కొలువుంచారు. పాశుర విన్నపాన్ని ఘనంగా జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తదితరులు

సబ్బవరం: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తవ్వవానిపాలెం, బోదువలస, ఎల్లుప్పి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు, తవ్వవానిపాలెంలోని మినీ గోకులానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం తవ్వవానిపాలెంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, సర్పంచ్ బోకం స్వామినాయుడు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, జనసేన పార్టీ నాయకులు ఇందల రమణ, బలిరెడ్డి అప్పారావు, బంతికోళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ‘సాయి హెల్పింగ్ హ్యాండ్స్’ సేవ



వృద్ధులకు కేశ ఖండన చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, అనాథలు, మానసిక దివ్యాంగులకు సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఆదివారం కేశ ఖండన సేవ చేశారు. ఆశ్రమంలో ఉన్న 120 మందికి ట్రస్ట్ ప్రతినిధులు స్వయంగా కేశ ఖండన చేశారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, ప్రతినిధులు సిరిమళ్ల గణేష్, కందల నవీన్, దెందేటి కృష్ణ, కారి సూర్యనారాయణ, లయోలా సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



వార్షికోత్సవంలో పాల్గొన్న ధ్యాన గురువులు

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని ధ్యాన గ్రాండ్ మాస్టర్, బుద్ధ సీఈవో చంద్రశేఖర్ అన్నారు. శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ ఎంతగానో అవసరం అన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా నిరంతర ధ్యానం అలవరచుకోవాలన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ధ్యాన మాస్టర్లు, ధ్యాన కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

జీఈఎం వింటర్ వర్క్‌షాప్‌తో మహిళా సాధికారత

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీఈఎం వింటర్ వర్క్ షాపును యువతులు సద్వినియోగం చేసుకోవాలని దీపికా లేడీస్ క్లబ్ (డీఎల్‌సీ) అధ్యక్షురాలు నీతాశర్మ కోరారు. ఎన్టీపీసీ సింహాద్రి దీపికా లేడీస్ క్లబ్ సహకారంతో స్థానిక బాల భారతి పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజులవర్క్ షాపులో పాల్గొన్న 13 జెడ్పీ పాఠశాలలకు చెందిన 110 మంది బాలికలకు సాధికారత కల్పించారు. వర్క్ షాపులో పాల్గొన్న బాలికలకు స్టేషనరీ కిట్లు, యోగా మ్యాట్‌లను పంపిణీ చేశారు. సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



రాజగోపురం ఎదురుగా ముగ్గులు వేస్తున్న మహిళలు

సింహాచలం: భోగి, సంక్రాంతిని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో మహిళలు, యువతులు రంగురంగుల ముగ్గులు వేశారు. విజేతలకు సోమవారం జరిగే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు అందజేస్తారు. సూపరింటెండెంట్ సత్యవాణి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వికసించిన బ్రహ్మకమలం



చినముషిడివాడలోని ఓ ఇంట్లో బ్రహ్మకమలం వికసించి, పలువురిని ఆకర్షిస్తోంది. స్థానికంగా నివాసం ఉంటున్న వురివి చెంచులక్ష్మి తన ఇంట్లోని పెరట్లో ఆరు నెలల క్రితం బ్రహ్మకమలం మొక్క నాటారు. అది ఆదివారం రాత్రి వికసించింది. పూర్తిస్థాయిలో వికసించిన బ్రహ్మకమలాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– పెందుర్తి

మద్యం బెల్ట్ దుకాణాలపై దాడులు

- ఇద్దరి అరెస్ట్, 43 మద్యం బాటిళ్ల స్వాధీనం

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం, ముదపాక గ్రామాల్లో మద్యం బెల్ట్ దుకాణాలపై పెందుర్తి పోలీసులు ఆదివారం దాడి చేశారు. గుర్రంపాలెంలోని ఓ ఇంట్లో మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు దాడి చేసి అక్కడ నిల్వ ఉన్న 25 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముదపాకలో ఓ ఇంటిపై దాడిలో 18 క్వార్టర్ బాటిళ్ల మద్యం దొరికింది. నిర్వాహకులపై ఏపీ ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.వి.సతీష్ కుమార్ పేర్కొన్నారు.